క్లుప్తంగా

నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలో విద్యుత్ శాఖకు సంబంధించి వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నందున ఈ నెల 15న వివిధ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. అభివృద్ధి పనుల జరుగుతున్నందున షరాఫ్‌బజారు నుంచి జిల్లా పరిషత్ వరకు, వడ్డెగేరి, యూకాన్ ప్లాజా ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

మంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

● అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ నెల 19వ తేదీన కర్నూ లు మెడికల్ కాలేజీ, హాస్పిటల్, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లను సందర్శించనుండటంతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వర్లు చెప్పారు. సోమవారం ఆయన కర్నూలు మెడికల్ కాలేజీ, హాస్పిటల్, క్యాన్సర్ విభాగాలను సందర్శన చేసి అనంతరం ఆయా విభాగాధిపతులతో మెడికల్ కాలేజీలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అత్యవసరమైన వసతులు, పరికరాల గురించి, సమస్యల గురించి నివేదిక తయారు చేసుకోవాలని తెలిపారు. అలాగే ఆయా విభాగాల్లో ప్రస్తు తం ఉన్న సమస్యల గురించి, వాటి పరిష్కారాల గురించి చర్చించి పరిష్కారం కోసం అప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై అనుమానాలు నివృత్తి చేయాలి



కలెక్టరేట్ ఎదుట శాంతి నిరసన వ్యక్తం చేస్తున్న క్రైస్తవులు

కర్నూలు(సెంట్రల్): పాస్టర్ పగడాల ప్రవీణ్ పోస్టుమార్టం రిపోర్టులో ఉన్న అనుమానాలను రాష్ట్ర ప్రభుత్వం నివృత్తి చేయాలని ఎక్యూమినికల్ పాస్టర్స్ అసోసియేషన్ నగర కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం ఆ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శాంతియుత నిరసన తెలిపారు. అంతకుముందు పాస్టర్ పగడాల ప్రవీణ్ ఆత్మకు శాంతి చేకూరలని ప్రార్థించారు. ఆ సంఘం నగర సలహాదారుడు బోనాల శశికుమార్, అధ్యక్షుడు ఆర్.రాఘవేంద్ర మాట్లాడుతూ.. మరోసారి పాస్టర్ ప్రవీణ్ మృతిపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలన్నారు. క్రైస్తవ మతస్తులపై జరుగుతున్న దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజ్యాంగం ప్రకారం అందరికీ అందరికీ అన్ని మతాలకు సమాన హక్కులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిట్టిబాబు, సురేష్ పాల్గొన్నారు.

జార్జిరెడ్డికి నివాళి



జార్జిరెడ్డికి నివాళి అర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం అరుణాతర జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసినివాళులర్పించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్ మాట్లాడుతూ.. జార్జిరెడ్డి ఉస్మానియా కాలేజీలో చదువుకునే సమయంలో కొన్ని మతోన్మాద శక్తులు హత్య చేశాయని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.కార్యక్రమంలో మహేంద్రబాబు, రమణ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఏప్రిల్ 26, 27, 28 తేదీల్లో కడపలో జరిగే ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.సోమన్న పిలుపునిచ్చారు. సోమవారం సీఆర్ భవన్‌లో ఆ సంఘం మాజీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్పతో కలసి కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఇంటర్మీడియట్ విద్యను మంత్రి నారాయణ సంస్థలకు అప్పగించాలన్న ఆలోచనలు మానుకోవాలన్నారు.

జోహార్.. అంబేడ్కర్

● అంబేడ్కర్ జయంతి సందర్భంగా నివాళి

కర్నూలు(అర్బన్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్ర పటాలకు వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పెద్ద సంఖ్యలో అధికారులు, నేతలు, ప్రజలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

➤ డీపీఓ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, జిల్లా పరిషత్ కార్యాలయంలోని మినీ సమావేశ భవనంలో జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

➤ కలెక్టరేట్ సమీపంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో జరిగిన కార్యక్రమానికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరై హాస్టల్‌లో మరమ్మతులకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సహాయ సాంఘిక సంక్షేమ అధికారి బీ మద్దిలేటి, బీసీ సహాయ సంక్షేమాధికారి ఆంజనేయులునాయక్, వసతి గృహ సంక్షేమాధికారిణులు డీపీ సులోచన, రజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

➤ స్థానిక రాజ్ విహార్ సెంటర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఆయన విగ్రహానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాసారపు వెంకటేష్ పూలమాల వేసి నివాళి అర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ ప్రదేశాల్లో జయంతి సభను రద్దు చేయడం దళితుల ఆత్మగౌరవంపై దెబ్బతీయడమేనన్నారు.

➤ స్థానిక రాజ్‌విహార్ సెంటర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, ఉపాధ్యక్షులు ధనుంజయ, కోశాధికారి కేసీ నాగన్న, మహిళా విభాగం అధ్యక్షురాలు టీ శ్రీలీల తదితరులు పాల్గొని బీఆర్ అంబేడ్కర్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు.

➤ అఖిల భారత తపాలా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత



అంబేడ్కర్ భవన్‌లోని విగ్రహానికి పూలమాల వేస్తున్న మాల విద్యార్థి సంఘం నేతలు



అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు

డా.బీఆర్ అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ జనార్దన్‌రెడ్డి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఫజుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

సమానత్వమే అంబేడ్కర్ అభిమతం

కర్నూలు(హాస్పిటల్): సమానత్వమే భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ అభిమతమని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ అన్నారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆమెతో పాటు అధికారులు, ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

➤ కర్నూలు మెడికల్ కళాశాలలోఏపీ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (జీడీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జీడీఏ అధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్, నాయకులు డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ రామశివనాయక్ తదితరులు, వైద్య ఆరోగ్యశాఖలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాజీ ఉద్యోగులు పీఎం. రంగస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ జీసీ.రాముడు తదితరులు బాబాసాహెబ్‌కు నివాళులర్పించారు.



జెడ్పీలో నివాళి అర్పిస్తున్న సీఈఓ జీ నాసరరెడ్డి, ఉద్యోగులు



రైల్వే స్టేషన్ ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తూ..



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న డీఎంహెచ్ఓ, అధికారులు

➤ డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం వల్లే దేశంలో బడుగు బలహీనవర్గాలు, దళితులు అనేక ప్రయోజనాలు పొందుతున్నారని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ చెప్పారు. గురుదత్త పాలిక్లినిక్‌లో నిరుపేద మహిళలకు ఆయన చీరలను పంపిణీ చేశారు.

కర్నూలు (టౌన్): స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి కర్నూలు సేవా సమితి నాయకులు నౌషాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైల్వే మాస్టర్ శేషు, రైల్వే పోలీసు ఫోర్స్ సీఐ రామమోహన్, ప్రేమ్‌కుమార్, రమేష్ రెడ్డి పాల్గొన్నారు. స్థానిక లేబర్ కాలనీలో



ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి

నగరంలో జైభీమ్ ర్యాలీ

కర్నూలు (టౌన్): అంబేడ్కర్ జయంతి సందర్భంగా జైబీమ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ చిత్ర పటంతో జైబీమ్ కార్యకర్తలు చేపట్టిన ర్యాలీ కలెక్టరేట్ నుంచి రాజ్‌విహార్ సెంటర్ మీదుగా పాతబస్టాండ్‌కు చేరుకుంది. ఈ ర్యాలీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, నగర కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు. ర్యాలీ నుద్దేశించి ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్ల అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా

బాబా సాహెబ్‌ను స్ఫూర్తిగా తీసుకుందాం

కర్నూలు: అంబేడ్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విధుల్లో పునరంకితమవుదామని అడిషనల్ ఎస్పీలు హుసేన్ పీరా కృష్ణమోహన్ పోలీసు సిబ్బందికి పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయ పెరేడ్ మైదానంలో అడిషనల్ ఎస్పీలు హుసేన్ పీరా, కృష్ణమోహన్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

➤ కర్నూలు(అర్బన్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయనతో పాటు కర్నూలు ఎంపీ బస్తి పాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ పీ రంజిత్‌బాషా, జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి భరత్ మాట్లాడుతూ సమాజంలో అందరికి సమాన హక్కులు కల్పించడంలో ముఖ్య పాత్ర పోషించారన్నారు.

➤ స్థానిక బీ క్యాంప్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ నెంబర్ 1 కళాశాల బాలికల వసతి గృహంలో వసతి గృహ సంక్షేమాధికారిణి బీ బెన్నమ్మ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు.

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎంపిక శ్రేణి సెక్రటరీ జయలక్ష్మి ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ అధికారులు, సిబ్బంది అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యతోనే సమగ్రాభివృద్ధి



విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(అర్బన్): పేదరికంలో జన్మించిన బాబా సాహెబ్ అంబేడ్కర్ ఎంతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించారని కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల (టౌన్)లో ఏపీ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఎంపీ ఆవిష్కరించారు.

రాజ్యాంగ నిర్మాతకు నివాళులు

కర్నూలు సిటీ: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతిని పలు విద్యా సంస్థల్లో నిర్వహించి నివాళులర్పించారు. మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో అకడమిక్ డైరెక్టర్లు డాక్టర్ ఆదిమూలపు సతీష్, స్టెల్లా సతీష్, ప్రిన్సిపాల్ మహాలక్ష్మి పాల్గొన్నారు. క్లస్టర్ యూనివర్సిటీలో ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య వి.వెంకట బసవరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లులు పాల్గొని అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. కార్యక్రజుఘుజలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా శాంతి, ఆర్‌యూ రిజిస్ట్రార్ విజయ్‌కుమార్



మైపర్ కాలేజీలో అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఆదిమూలపు సతీష్



ఒకేషనల్ కాలేజీలో అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళ్లు ఆర్పిస్తున్న ఆర్ఐఓ గురవయ్య శెట్టి

నాయుడు, కేవీఆర్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ దేవికా రాణి తదితరులు పాల్గొన్నారు.

➤ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవి కుమార్, నవీన్ పాటి, జిల్లా ఉపాధ్యక్షుడు హేమంత్‌కుమార్, తదితరులు, పీఆర్‌టీయూ జిల్లా కమిటీ అధ్యక్షుడు ఎన్వీ కృష్ణారెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు రమణయ్య, రాష్ట్ర కౌన్సిలర్లు బాబూరావు, ఆదినారాయణ రెడ్డి తదితరులు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి, జిల్లా ప్రధాన కార్యదర్శి టీకే జనార్దన్, శ్రీనివాసులు, శేఖర్, తదితరులు పాత బస్టాండ్ దగ్గర ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

➤ స్థానిక బీక్యాంపులోని ప్రభుత్వ వొకేషనల్ కాలేజీలో నిర్వహించిన వేడుకల్లో ఇంటర్మీడియేట్ ప్రాంతీయ కార్యాలయ అధికారి ఎస్వీఎస్ గురవయ్య శెట్టి, మాధవీనగర్‌లోని నారాయణ స్కూల్లో క్లస్టర్ ప్రిన్సిపాల్ అన్వర్ బాషా, క్రియేటివ్ ఎడ్యుకేషనల్ సొసైటీ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి నాగసుధ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేడ్కర్ సేవలను వక్తలు కొనియాడు.

విశ్వ మేధావి అంబేడ్కర్

కర్నూలు(సెంట్రల్): ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య భారతదేశ రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ మేధావి అని కర్నూలు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్‌జిలానీ బాషా అభిప్రాయపడ్డారు. సోమవారం డీసీసీ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఆయనచిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

➤ కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో కార్మికులకు ఉచిత అల్పాహార పంపిణీ చేపట్టారు. ముందుగా అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

➤ పాతబస్తీలోని సుర్జీత్ భవన్‌లో సీపీఎం నాయకులు ఎం.రాజశేఖర్, ఎస్ఎండీ షరీఫ్, డి.అబ్దుల్‌దేశాయ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. భారతరాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్న వారిపై అంబేడ్కర్ స్ఫూర్తితో పోరాటాల ద్వారా తరిమికొట్టేందుకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు.



జోహరాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

➤ అంబేడ్కర్ స్ఫూర్తితో పురుషులు, మహిళలు సమాన్న దాని కోసం పోరాటాలు చేద్దామని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.నిర్మల పిలుపునిచ్చారు. అంబేడ్కర్ భవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శ్రీరామ నగర్‌లో కులవివక్ష పోరాటసమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని కార్యక్రమాన్ని నిర్వహించారు. లేబర్ కాలనీలో వెలుగు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, మహిళలకు చీరలను ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకృష్ణ, కర్నూలు రూరల్ తహసీల్దార్ రమేష్‌బాబు పంపిణీ చేశారు.

➤ అంబేడ్కర్ స్ఫూర్తితో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై ఉద్యమిద్దామని సీపీఐ జిల్లా సహాయక కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అట్టడుగు వర్గాల ఆశా జ్యోతి

కర్నూలు కల్చరల్: అట్టడుగు వర్గాల ఆశా జ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా



విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న కర్నూలు తహసీల్దార్ రమేష్‌బాబు



ఆర్‌యూలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న వీసీ వెంకట బసవరావు

ఆర్‌యూలో నిలువెత్తు విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో జరిగిన వేడుకల్లో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాష్, డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క తదితరులు, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు టీసీ మద్దిలేటి, జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ లక్కిరెడ్డి అమర సింహారెడ్డి, గోవిందరాజులు తదితరులు, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాయలసీమ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో వర్సిటీ కన్వీనర్ రామకృష్ణ, నాయకులు రాజు, గణేష్ తదితరులు బాబా సాహెబ్‌కు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆసుపత్రి అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

● మంత్రి టీజీ భరత్

కర్నూలు(సెంట్రల్): కర్నూలు సర్వజన ఆసుపత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖామంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అత్యవసర విభాగాలకు సంబంధించిన నిర్వహణ పనులన్నీ కాంప్రహెన్సివ్ మెయింటెనెన్స్ కాంట్రాక్ట్ కింద ఉండే విధంగా చూడాలని సూచించారు. లిఫ్టులు, జనరేటర్లకు సంబంధించిన పనులను కూడా సీఎంసీ కిందకు తీసుకురావాలన్నారు. ఆసుపత్రిలో పందుల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని గతంలోనే అధికారులను ఆదేశించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ.. సిటీస్కాన్, ఎంఆర్ఐస్కాన్ నిర్వహణకు సంబంధించి అవుట్‌సోర్సింగ్‌లో సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. ఆసుపత్రి వంద ఎకారల్లో ఉన్నా సరైన పార్కింగ్‌ను ఏర్పాటు చేసుకోలేకపోతున్నారని, 5,6 తరగతులుగా విభజించుకొని పార్కింగ్‌ను క్రమబద్ధీకరించాలని సూచించారు. ఆసుపత్రికి మరో గేటు ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ తన ఐదేళ్ల పదవి కాలంలో ఆసుపత్రి అభివృద్ధికి తగిన నిధులను కేటాయిస్తానని చెప్పారు. ఆసుపత్రిలో పాముకాటు, కుక్కకాటులకు మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, బొగ్గుల దస్తగిరి, అడిసినల్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వర్లు, నామినేటెడ్ కమిటీ సభ్యులు బైసాని పద్మజ, రంగనాథ్‌రెడ్డి, డాక్టర్ ప్రవీణ్, సాయిప్రదీప్, బోయ రామంజనేయులు, మునిసిపల్ కమిషనర్ రవీంద్రబాబు, అడ్మినిస్ట్రేటర్ సింధూ సుబ్రమణ్యం, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ, సీఎస్ఆర్ ఎం ఓ డాక్టర్‌వెంకటేశ్వరావు, డీఎంహెచ్ఓ శాంతికళ, డీసీహెచ్ఎస్ శ్రీనివాసులు, కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్, చిత్రంలో కలెక్టర్ రంజిత్‌బాషా, ఎంపీ నాగరాజు తదితరులు

కంపు.. కంపు



కల్వర్టు కుంగిపోవడంతో పైకి వచ్చిన మురుగు నీరు

కర్నూలు సిటీ: స్థానిక ఆర్టీసీ డిపో–2 ఎదుట డ్రైనేజీ కాలువ నుంచి మురుగు నీరు రోడ్డెక్కి పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బస్టాండ్ లోపలికి బస్సులు వెళ్లే దగ్గర ఉన్న హోటల్, ఆర్టీసీ దుకాణాల నుంచి, పబ్లిక్ టాయిలెట్స్ నుంచి వచ్చే మురుగు నీరు బస్టాండ్ ప్రాంగణం నుంచి బయటికి వెళ్లేందుకు కాలువ ఏర్పాటు చేశారు. అయితే కాలువ కల్వర్టు కుంగిపోయి మురుగు నీరు పైకి రావడంతో అటు ప్రయాణికులు, ఇటు ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు సమస్యను చూస్తున్నా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం లేదు.

ధార్మిక జీవనానికి దిక్సూచి శ్రీమద్రామాయణం

కర్నూలు కల్చరల్: శ్రీమద్రామాయణం ధార్మిక జీవనానికి దిక్సూచని త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీ అన్నారు. కర్నూలు నగర శివారులోని గోదా గోకులంలో నిర్వహిస్తున్న శ్రీమద్రాయణ మహాయజ్ఞంలో భాగంగా శ్రీమద్రామాయణంలోని విభిన్న అంశాలపై ప్రవచన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జీయర్ స్వామీజీ అనుగ్రహ భాషణం చేస్తూ యుగయుగాలు, తరతరాలుగా మానవులందరికి ఆదర్శవంతమైన జీవన మార్గాన్ని ప్రబోధించే అద్భుత కావ్యం శ్రీమద్రామాయణం అన్నారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ దేశ కాల ప్రాంతాలకు అతీతంగా సర్వ మాన వాళికి ఆదర్శవంతమైన ధర్మ మార్గ ప్రవర్తకునిగా శోభిల్లిని శ్రీమాయచంద్రుని జీవితం వర్తమాన సమాజానికి ఎంతో స్ఫూర్తి దాయకంగా ఉందన్నారు. శ్రీరామ మాతృమూర్తులు అనే అంశంపై డాక్టర్ మధుసూదనాచార్యులు, శ్రీమద్రామాయణం మిత్ర ధర్మం అనే అంశంపై బి. సర్వజ్ఞ మూర్తి, శ్రీమద్రామాయణం – గురు ధర్మం అనే అంశంపై హరిబెల్ సీతామహాలక్ష్మి, శ్రీమద్రామాయణం – మానవ విలువలు అనే అంశంపై డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని ఉపన్యసించారు.



అనుగ్రహ భాషణం చేస్తున్న త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీ

శరణు శరణు..శబరిగిరీశా

కర్నూలు కల్చరల్: అయ్యప్ప స్వామి విషు మహోత్సవ పూజలు వైభవంగా జరిగాయి. సోమవారం భాస్కర్ నగర్ అయ్యప్ప స్వామి దేవాలయం, సప్తగిరి మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయాల్లో స్వామి వారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక అర్చనలు, సాయంత్రం పూలంకి సేవ, పడిపూజ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. భక్తులచే నిర్వహించిన భజన అలరించింది. అల్పాహార ప్రసాద వితరణ చేశారు.



పడి పూజలో పాల్గొన్న భక్తులు

● ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో శ్రీ అయ్యప్ప స్వామి విషు మహోత్సవ పూజలు ఘనంగా జరిగాయి. పడి పూజ, పూలంకి సేవలు విశేషంగా జరిగాయి. లలితా పీఠం గురుస్వాములచే నిర్వహించిన అయ్యప్ప భజన ప్రత్యేకంగా నిలిచింది. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి సందేశమిచ్చారు. భక్తులకు అల్పాహార ప్రసాద వితరణ చేశారు

25 నుంచి ఆర్చరీ వేసవి శిక్షణ శిబిరం

కర్నూలు (టౌన్): ఈనెల 25వ తేదీ నుంచి నగరంలో ఉచిత ఆర్చరీ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్చరీ సంఘం జిల్లా కార్యదర్శి నాగరత్నమయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 రోజులు పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో, బిర్లా కాంపౌండ్, హోసన్న మందిరం వద్ద, ఆదర్శ స్కూల్ (నందికొట్కూర్ రోడ్డు) ప్రాంతాల్లో ఈ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9393855460ను సంప్రదించాలని సూచించారు.

వైభవంగా బీరప్ప దేవర

సి.బెళగల్: మారందొడ్డి గ్రామంలో బీరప్ప స్వామి దేవర ఘనంగా నిర్వహించారు. సోమవారం తుంగభద్ర నది నుంచి తొమ్మిది గ్రామాల బీరప్ప స్వాముల ఉత్సవ పల్లకీలను నడక మార్గంలో గ్రామానికి చేర్చారు. అక్కడ ఊరేగించి గ్రామశివారులోని స్వామి ఆలయానికి తీసుకెళ్లారు. అనంతరం గ్రామంలోని పూజారి ఇంటి నుంచి కుంభం కాగును ఆలయానికి చేర్చి మొక్కులు చెల్లించుకున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కర్నూలు
70750 09182
Office mail : sakshiknladvt@gmail.com